సాక్షి రంగారెడ్డి

బుధవారం : 23 : అక్టోబర్ : 2024



మతం పేరుతో రాజకీయం

దేశంలోని బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో రాజకీయం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ పేర్కొన్నారు. 8లో ▶



పాల ఉత్పత్తులపై శిక్షణ

యాచారం మండలం గడ్డమల్లయ్యగూడలో అభ్యుదయ పాడి మహిళలకు పాల ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చారు. 8లో ▶



సమస్యలు పరిష్కరించాలి

ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తపస్ జిల్లా మహిళా ప్రముఖ్ సుమరంజిత డిమాండ్ చేశారు. 8లో ▶

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ఉష మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు దృష్టికి తేవాలని సూచించారు. 99592 26287 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కోహెడ మార్కెట్ నిర్మాణానికి సహకరించండి



కలెక్టర్‌కు పండ్ల బుట్టను అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: కలెక్టర్ శశాంకను గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కోహెడలో మార్కెట్ నిర్మాణానికి సర్వేనంబర్ 507/2, 548/2లలోని 178 ఎకరాల ప్రభుత్వ భూమిని 2016లో ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. నిర్మాణం కోసం ఇప్పటికే రూ. 314కోట్లు మార్కెట్ల ద్వారా సమకూర్చుకోగా, ఫైల్ ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్ద ఉందన్నారు. కోహెడలో నూతన మార్కెట్ నిర్మాణంతో పాటు అభివృద్ధికి సహకరిస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. మార్కెట్‌కు వచ్చే ప్రతిరైతుకు న్యాయం చేస్తూ గడ్డిఅన్నారం మార్కెట్‌కు మరింత గుర్తింపు తీసుకురావాలని సూచించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి కలెక్టర్‌కు శాలువ కప్పి సత్కరించారు. వివిధ రకాల పండ్లను బహూకరించారు.

నూతన నియామకం



బలదేవరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడి (వర్కింగ్ ప్రెసిడెంట్)గా కోహెడా గ్రామానికి చెందిన కందాళ బలదేవరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బలదేవరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో పాలుపంచుకున్న ఉద్యమకారులను ఏకం చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఫోరం తరఫున పనిచేస్తానన్నారు. ఈ పదవిని తనకు అప్పగించిన చైర్మన్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్‌రావు

శంకర్‌పల్లి: పాఠశాల దశలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. మండల పరిధిలోని మోకిలలో మంగళవారం అండర్-14, అండర్-17 బాలబాలికలకు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు, ఎంపికలు నిర్వహించారు. డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. పోటీల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 32 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ఎంఈఓ అక్బర్, సీఐ వీరబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకయ్య, చేవెళ్ల ఎంఈఓ పురం దాస్, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విభాగం	ప్రథమ	ద్వితీయ
అండర్ -14 (బాలుర)	ఇబ్రహీంపట్నం	మహేశ్వరం
అండర్ -14 (బాలికలు)	కడ్తాల్	షాద్‌నగర్
అండర్ -17 (బాలుర)	మహేశ్వరం	కడ్తాల్
అండర్ -17 (బాలికలు)	శేరిలింగంపల్లి	రాజేంద్రనగర్

అత్యాచారం కేసులో యావజ్జీవ కారాగార శిక్ష

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన ఘటనలో నిందితుడికి ఎల్బీ నగర్ న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన రాజు అలియాస్ చిన్న పోతురాజు(27) బాలాపూర్ పరిధిలో నివసిస్తున్నాడు. 2018లో సమీపంలో ఉండే బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.26 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

అప్పుడే ఫీజులుం!

ఆరు నెలల ముందే వంద శాతం ఫీజు వసూలు



- కార్పొరేట్ ఇంటర్మీడియెట్ కాలేజీల ఇష్టారాజ్యం
- చెల్లించని వారిని హాస్టళ్లకు అనుమతించని వైనం
- ఫిర్యాదు చేసినా పట్టని అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యా సంవత్సరం ప్రారంభమై.. ఆరు నెలలు కూడా దాటలేదు. వార్షిక పరీక్షలకు మరో ఆరు నెలల సమయం కూడా ఉంది. అయినా జిల్లాలోని పలు కార్పొరేట్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు విద్యార్థుల నుంచి అప్పుడే వంద శాతం ఫీజులు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. సమయానికి డబ్బులు సర్దుబాటు కాక ఫీజు చెల్లించని విద్యార్థులను ప్రధాన గేటు ముందు నిలిపివేస్తున్నారు. కనీసం హాస్టల్లోకి కూడా అనుమతించడం లేదు. విధిలేని పరిస్థితుల్లో కొంతమంది తల్లిదండ్రులు అప్పు చేసి ఫీజులు చెల్లిస్తుండగా, మరికొంత మంది టీసీ ఇస్తే వెళ్లిపోతామంటున్నారు. ఇంటర్ సిలబస్ ఇప్పటికీ ప్రారంభించకపోయినా.. రూల్ 14కి భిన్నంగా కాలేజీలు నడుపుతున్నా.. అదనపు తరగతులు కొనసాగిస్తున్నా.. ఫీ'జులుం' ప్రదర్శిస్తున్నా జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కానీ, ఆర్జేడీ కానీ, కార్యదర్శి కానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మనోవేదనలో విద్యార్థులు

జిల్లాలో 241 ఇంటర్మీడియట్ కాలేజీలు ఉండగా, వీటిలో 18 ప్రభుత్వ, 60 మోడల్ రెసిడెన్షియల్ కాలేజీలతో పాటు మరో 163 కార్పొరేట్, ప్రైవేటు రెసిడెన్షియల్ కాలేజీలు ఉన్నాయి. కేవలం రెండు ప్రధాన విద్యా సంస్థలకు సంబంధించిన రెసిడెన్షియల్ కాలేజీలే 50 వరకు ఉన్నట్లు అంచనా. మాదాపూర్ అయ్యప్ప సొసైటీ సహా ఔటర్ రింగ్‌రోడ్డుకు అటు ఇటుగా ఆదిబట్ల, రావిర్యాల, కోహెడ కేంద్రంగా కొనసాగుతున్న కార్పొరేట్ ఇంటర్మీడియట్ కాలేజీలు ఫీజులుం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీల అనుమతి సహా ఫైర్‌సేఫ్టీ లేని భవనాల్లో తరగతులు, వసతి గృహాలు నిర్వహిస్తున్నాయి. సాధారణంగా 250 నుంచి 300 మంది విద్యార్థుల సామర్థ్యం కలిగిన భవనాల్లో 750 నుంచి 1000 మందిని సర్దుబాటు చేస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలు మాత్రమే ఉండాల్సిన ఇరుకైన గదుల్లో ఆరు నుంచి ఎనిమిది మందిని కుక్కేస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. రోజుల తరబడి నాలుగు గోడల మధ్యే ఉండటంతో మానసికంగా కుంగిపోతున్నారు. కోహెడలోని ఓ కార్పొరేట్ కాలేజీలోని విద్యార్థి కాంపౌండ్ వాల్‌కు ఉన్న కరెంట్ తీగను పట్టుకుని ఆత్మహత్యకు పాల్పడినా అధికారుల్లో చలనం రావడం లేదు.

సౌకర్యాలు కరువు

సరైన వెంటిలేషన్ కూడా లేకపోవడానికి తోడు పారిశుద్ధ్య లోపంతో విద్యార్థులు తరచూ ఆరోగ్య సమస్యల బారినపడుతున్నారు. జ్వరం, తలనొప్పి, కడుపు నొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలతో అస్వస్థతకు గురైన విద్యార్థులకు తక్షణమే చికిత్స అందించేందుకు అర్హులైన వైద్యుడితో పాటు స్టాఫ్ నర్సు ఉండాలి. ఏ ఒక్క కాలేజీలోనూ అలాంటి సౌకర్యం కల్పించడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ఆయా విద్యార్థులను అంబులెన్స్‌ల్లో కన్సల్టెంట్ల ఆస్పత్రులకు తరలించి చేతులు దులుపుకొంటున్నారు. విద్యార్థులు మానసిక రుగ్మతల బారినపడకుండా ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సైకాలజిస్టుతో పాటు సైక్రియాటిస్ట్‌ను నియమించాల్సి ఉన్నా పాటించిన దాఖలాలు లేవు. రెసిడెన్షియల్ కాలేజీల్లోని విద్యార్థుల మానసిక, శారీరక వికాసం కోసం విధిగా క్రీడలు ఆడించాలి. ఏ ఒక్క కాలేజీ యాజమాన్యం ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఇటీవల కొండాపూర్‌లోని పలు కార్పొరేట్ రెసిడెన్షియల్ కాలేజీల్లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఇదే అంశం తేటతెల్లం కావడం గమనార్హం.

చర్యలు తీసుకోవాలి

కార్పొరేట్ రెసిడెన్షియల్ కాలేజీల యాజమాన్యాలు విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నాయి. వార్షిక పరీక్షల తేదీ కూడా వెల్లడించక ముందే విద్యార్థుల నుంచి వంద శాతం ఫీజులు వసూలు చేయడం దారుణం. పాఠ్యాంశాల బోధన, తరగతుల నిర్వహణలోనూ నిబంధనలు పాటించడం లేదు. ఇంటర్మీడియెట్ బోర్డు సిలబస్‌ను ఇప్పటి వరకు ప్రారంభించలేదు. విద్యార్థులపై నీట్, జేఈఈ సిలబస్ రుద్దుతున్నారు. బలవంతపు వసూళ్లకు పాల్పడే విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. హాస్టళ్లలో విధిగా తనిఖీలు నిర్వహించాలి. – ప్రేమ్‌కుమార్, క్రైస్తవ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు

ఆలస్యంగా వచ్చి.. నిరాశతో వెనుదిరిగి

గ్రూప్-1 పరీక్షకు లేట్‌గా వచ్చిన అభ్యర్థులు

- అనుమతించేది లేదన్న అధికారులు
- ఉసూరుమంటూ వెళ్లిపోయిన పలువురు



ఆలస్యంగా వచ్చి పరీక్ష రాయలేకపోయిన నవీన్‌కుమార్, వినయ్‌కుమార్

మొయినాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు రాసే అభ్యర్థులకు సమయం సైతం ఓ పరీక్షలా మారింది. రెండు మూడు నిమిషాలు ఆలస్యం అయినా అధికారులు లోనికి అనుమతించకపోవడంతో అభ్యర్థుల ఆశలు ఆవిరైపోతున్నాయి. రెండో రోజు మంగళవారం జరిగిన పరీక్షకు మండలంలోని రెండు పరీక్ష కేంద్రాలకు ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా వచ్చారు. ఎనికేపల్లి రెవెన్యూలో అమ్డాపూర్ చౌరస్తా వద్ద ఉన్న జేబీఆర్‌ఈసీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన టంకర నవీన్‌కుమార్ మూడు నిమిషాలు ఆలస్యంగా వచ్చాడు. మధ్యాహ్నం 1.30 గంటలకు అధికారులు గేటు మూసివేయగా 1.33 గంటలకు అతను పరీక్ష కేంద్రానికి చేరుకున్నాడు. అప్పటికే గేటు మూసివేయడంతో అధికారులు అనుమతించలేదు. రెండున్నర సంవత్సరాల నుంచి కష్టపడి ప్రిపేర్ అయ్యానని.. గ్రూప్-1 ఉద్యోగం సాధించడం తన కల అని అధికారుల కాళ్లావేళ్లా పడ్డాడు. తామేమీ చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. దీంతో చేసేది లేక నవీన్‌కుమార్ ఏడ్చుకుంటూ వెళ్లిపోయాడు.

వీజేఐటీ కళాశాలలో..

వికారాబాద్ జిల్లా కేతేపల్లికి చెందిన బి.వినయ్ కుమార్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ గ్రూప్-1 పరీక్షలు రాస్తున్నాడు. హిమాయత్‌నగర్ రెవెన్యూలో అజీజ్‌నగర్ చౌరస్తా వద్ద ఉన్న వీజేఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొదటి రోజు సోమవారం పరీక్ష రాశాడు. మంగళవారం రెండో రోజు పరీక్షకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చాడు. 1.35 గంటకు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోగా అప్పటికే గేట్లు మూసివేశారు. పరీక్షకు అనుమతించాలని అధికారులు, పోలీసులతో ప్రాధేయపడినా లాభం లేకపోయింది. చేసేది లేక నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయాడు.

సీవీఆర్ సెంటర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని మంగళ్‌పల్లిలో గల సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ శశాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. తరగతి గదిలో పరీక్ష రాస్తున్న అభ్యర్థుల సరళిని పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స సెంటర్‌ను ముందుగా పరిశీలించారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ సునీత, సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్, పోలీసు అధికారులు ఉన్నారు.



చిత్తాపూర్‌లో పత్తిచేనును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తదితరులు

సాగులో మెలకువలు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

మంచాల: పంటల సాగులో రైతులు మెలకువలు తప్పనిసరి నేర్చుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. మండల పరిధిలోని చిత్తాపూర్‌లో మంగళవారం కృషి విజ్ఞాన్ కేంద్ర, జిల్లా డ్రైలాండ్ అగ్రికల్చర్ సౌజన్యంలో నిర్వహించిన క్షేత్ర దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక సాంద్రత సాగుతో పంట దిగుబడి 20 నుంచి 30 శాతం పెరుగుతుందన్నారు. రైతులు పంట సాగు విషయంలో నూతన పద్ధతులను అవలంబించాలన్నారు. భూసార పరీక్షలు మొదలుకొని విత్తన శుద్ధి.. పంట దిగుబడి వచ్చే వరకు ఆధునిక పద్ధతిలో పంటలు సాగు చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రైతులతో సమావేశమయ్యారు. కంది, పత్తి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ సుజాత, క్రీడా సీనియర్ సైంటిస్ట్ చంద్రకాంత్, ప్రిన్సిపాల్ ఏఆర్ రెడ్డి, శాస్త్రవేత్తలు భాస్కరన్, షేక్, మీరా, విజయ్‌కుమార్, శ్రీకృష్ణ, మండల వ్యవసాయాధికారి మాధవీలత, ఏఈఓలు లింగ స్వామి, సాయిసిరి, సాయి వాణి, రైతు సంఘం చైర్మన్ సుధాకర్, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భూపాల్‌రెడ్డి అక్రమ ఆస్తుల గుర్తింపు

ఇబ్రహీంపట్నం రూరల్: గతంలో లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన అడిషనల్ కలెక్టర్ వెంకట భూపాల్‌రెడ్డిపై అక్రమాస్తుల కేసు నమోదైంది. ఈ మేరకు యాంటి కరప్షన్ బ్యూరో డైరెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఓ భూ వ్యవహారంలో రూ.8 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన భూపాల్‌రెడ్డికి అనేక చోట్ల అక్రమ ఆస్తులు ఉన్నట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు గుర్తించారు. ఆయనతో పాటు ఆయన బంధువుల ఇళ్లు, మరో నాలుగు చోట్ల సోదాలు నిర్వహించారు. రూ.5,05,71,076 విలువ చేసే స్థిర,చరాస్తులు ఉన్నట్లు గుర్తించారు. మరో రూ.4,19,40,158 అనుమానిత అస్తులు ఉన్నట్లు తేల్చారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ అంతకు మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

రాంచరణ్.. ఆర్టీఏకు వచ్చెన్..



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సినీనటుడు రాంచరణ్ మంగళవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. ఆయన కొత్తగా కొనుగోలు చేసిన రోల్స్‌రాయిస్ కారు రిజిస్ట్రేషన్ కోసం స్వయంగా వచ్చారు. తనకు నచ్చిన నెంబర్ 'టీజీ 09సి 2727' తీసుకున్నారు. హైదరాబాద్ సంయుక్త రవాణా కమిషనర్ సి.రమేష్. ప్రాంతీయ రవాణా అధికారి పురుషోత్తమ్‌రెడ్డిలు మోటారు వాహన నిబంధనల మేరకు కొత్త వాహనం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆర్టీఏ అందజేస్తున్న పారదర్శకమైన పౌరసేవలపై రాంచరణ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి వాహనదారుడు విధిగా ఆర్టీఏ కార్యాలయానికి రావడం వల్ల అన్ని వివరాలు కచ్చితంగా నమోదవుతాయని చెప్పారు.

ఔటర్ దాకా.. వెలుగు జిలుగులు

- ఎల్ఈడీ స్ట్రీట్‌లైట్ల ఏర్పాటుకు సిద్ధమవుతున్న జీహెచ్ఎంసీ
- ముగియనున్న ఈఈఎస్ఎల్ నిర్వహణ గడువు
- కొత్త ఏజెన్సీకి అప్పగించే యోచనలో యంత్రాంగం



సాక్షి, సిటీబ్యూరో: ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణలో ఈఈఎస్ఎల్ విఫలమైన అనుభవంతో.. కొత్త ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించే యోచనలో జీహెచ్ఎంసీ ఉంది. ఒప్పందం మేరకు ఈఈఎస్ఎల్‌కు వచ్చే సంవత్సరం ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు ఉంది. ఆ తర్వాత వీధిదీపాల నిర్వహణ పటిష్టంగా ఉండేందుకు పకడ్బందీ చర్యలకు జీహెచ్ఎంసీ సిద్ధమవుతోంది. మరోవైపు ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్‌రోడ్) వరకున్న కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలను జీహెచ్ఎంసీలో కలపడంతో పాటు జీహెచ్ఎంసీని మూడు లేదా నాలుగు కార్పొరేషన్లుగా చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నందున ఓఆర్ఆర్ వరకు కూడా వీధి దీపాల లెక్కలు తీసే పనిలో పడింది. ఇందుకోసం ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో, శివార్లలో ఓఆర్ఆర్ వరకున్న పురపాలికలు, గ్రామపంచాయతీల్లో ఉన్న వీధి దీపాలెన్ని.. వాటిలో పని చేస్తున్నవి.. పని చేయనివి తదితర లెక్కలు తీసేందుకు సిద్ధమైంది. ఈ పనికి, దీంతోపాటు కొత్త ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించే ముందు అవసరమైన టెండర్ల నోటిఫికేషన్లు, టెండర్ల అనంతరం పనుల అప్పగింత తదితరమైనవి నిర్వహించేందుకు ప్రాజెక్ట్ మానిటరింగ్ కమిటీ (పీఎంసీ) కోసం జీహెచ్ఎంసీ టెండర్లు ఆహ్వానించింది. దీంతో పీఎంసీ ఏజెన్సీ వాటిని సర్వే చేసి వివరాలివ్వాల్సి ఉంటుంది. వీధిదీపాలు ఆటోమేటిక్‌గా ఆన్ అండ్ ఆఫ్ అయ్యేందుకు ప్రస్తుతమున్న సీసీఎంఎస్ (సెంట్రలైజ్డ్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్) బాక్సులు.. భవిష్యత్తులో ఎన్ని అవసరమవుతాయి, మొత్తం ఎన్ని వీధిదీపాల అవసరం ఉంటుంది వంటి వివరాలు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. కాంట్రాక్టు ఒప్పందం కుదిరినప్పటి నుంచి 45 రోజుల్లో ఈ వివరాలతో నివేదిక ఇవ్వాల్సి ఉంది. జీహెచ్ఎంసీతో పాటు శివార్లలోని కార్పొరేషన్లలోనూ ఈఈఎస్ఎల్ వీధిదీపాల నిర్వహణను చూస్తోంది.

శివార్లలోని ఏడు కార్పొరేషన్లలో: మొత్తం 86,434

అవి: బడంగ్‌పేట్ (16,845). బండ్లగూడ జాగీర్ (13,164), మీర్‌పేట-జిల్లెలగూడ (7,722), బోడుప్పల్ (14,319), పీర్జాదిగూడ (11,485), జవహర్‌నగర్ (10,505), నిజాంపేట్ (12,394).

శివార్లలోని మున్సిపాలిటీల్లో: 1,48,533.

అవి: పెద్దఅంబర్‌పేట్ (7,907), ఇబ్రహీంపట్నం (3,403), జల్‌పల్లి(9,139), శంషాబాద్(12,941), తుర్కయాంజాల్ (11,907), మణికొండ (15,000) నార్సింగి (6,988), ఆదిబట్ల (4,189), తుక్కుగూడ(4,754), బొల్లారం (2,061), తెల్లాపూర్ (4,346), అమీన్‌పూర్ (11,488), దమ్మాయిగూడ (8,255), నాగారం (12,206), ఘట్‌కేసర్ (5,778), గుండ్లపోచంపల్లి (3,118), తూంకుంట (4,329), కొంపల్లి (3,223), దుండిగల్ (9,532), పోచారం (7,969).

వీధి దీపాల వివరాలివీ..	
జీహెచ్ఎంసీ పరిధిలో:	5.48 లక్షలు
కంటోన్మెంట్ పరిధిలో:	13,058

ఈ గ్రామాల్లో లెక్క తీయాలి

రామచంద్రాపురం, ఐలాపూర్, కర్దనూర్, కిష్టారెడ్డి పేట, ముత్తంగి, పోచారం, సుల్తాన్‌పూర్, కాచవాని సింగారం, కొర్రెముల్, పీర్జాదిగూడ, ప్రతాపసింగారం, బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతి పేట్, చీర్యాల, గోధుమకుంట, కీసర, రాంపల్లి, తిమ్మాయిపల్లి, యాద్గార్‌పల్లి, మంఖాల్, గొడవెల్లి, పూడూరు, మంచిరేవుల, బొమ్రాస్‌పేట్, గోల్కొండ కలాన్, గోల్కొండ ఖుర్ద్, హమీదుల్లానగర్, జన్వాడ, పాటి తదితర గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ఎన్ని వీధి దీపాలున్నాయో సర్వేలో భాగంగా లెక్క తీయాల్సి ఉంది.







దీపావళి.. దొంతులు రెడీ

వెలుగు పండగ దీపావళి సమీపిస్తున్న వేళ ఇళ్లలో ఏర్పాటు చేసుకునే దొంతుల తయారీ వేగం పుంజుకుంది. నగరంలోని పలు ప్రాంతాల్లో వీటిని తయారు చేసి విక్రయించేందుకు కుమ్మరులు సిద్ధమవుతున్నారు. నగరంలోని ఆసిఫ్‌నగర్ కుమ్మర్‌వాడిలో దొంతుల రూపకల్పనలో నిమగ్నమయ్యారు.

మతం పేరుతో బీజేపీ రాజకీయం



మాట్లాడుతున్న భాస్కర్

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

యాచారం: దేశంలోని బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో రాజకీయం చేస్తోందని, కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగిపోయాయని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో మంగళవారం సీపీఎం పార్టీ గ్రామశాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. దేశంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించకుండా మతం, కులం పేరుతో రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనులు, మహిళల మీద అనేక దాడులు జరుగుతున్నాయన్నారు. పారిశ్రామిక వేత్తలకు కొమ్ముకాస్తూ పేద, మధ్యతరగతి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం చింతపట్ల గ్రామ నూతన శాఖ కార్యదర్శులుగా సీహెచ్ సత్యం, గిరికాంత్‌లను ఎన్నుకున్నారు. అంతకుముందు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు జంగయ్య, వెంకటయ్య, నర్సింహ, రమేశ్, ప్రభాకార్, శ్రీను, గణేశ్, నాగరాజు, సురేశ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని పసుమాముల గ్రామ రెవెన్యూ పరిధిలోని అక్రమ నిర్మాణాన్ని కమిషనర్ రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది కూల్చివేసింది. గ్రామంలో సర్వేనంబర్ 386/3లో స్వాతంత్ర్య సమరయోధుడికి చెందిన 9.39 ఎకరాల భూమికి ఆక్రమించుకోవడంతో పాటు ప్రహరీ నిర్మాణం చేపట్టారన్న బాధితుడి ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు మంగళవారం జేసీబీతో కూల్చి వేయించారు. నిబంధనలను అతిక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.



ప్రహరీని కూల్చివేస్తున్న సిబ్బంది

CAUTION NOTICE

The General Public is hereby informed that my client namely Talla Bikshapathi, S/o. Late Balraj, R/o. Chimmulavanikunta, Rachullor village, Timmapur Grampanchayath, Kandukur Mandal, R.R. Dist. is the owner and possessor of the part of the below mentioned schedule property. To that effect my client filed OS No. 195 of 2012 on the file of Senior Civil Judge, Ibrahimpatnam, Ranga Reddy District and the said suit was dismissed. Aggrieved by the said Judgment and Decree my client preferred appeal vide AS No. 5 if 2022 on the file of III Addl. District Judge, R. R. District and the same is pending. My client further informed that on the schedule property another appeal A.S. 40 of 2017 also pending on the file of Hon'ble VIII Addl. District Judge, Ranga Reddy District.

It is hereby informed that during the pendency of the said civil cases Talla Jangaiah, S/o. late Balraj is trying to alienate the schedule property by suppressing the real facts and also pendency of the civil cases.

Hence the general public are hereby cautioned not to purchase or enter into any sort of agreement with Talla Jangaiah, S/o. late Balraj, in respect of schedule property. In spite of this caution notice, if any person or persons are enter into any sort of agreement or contract with the above person, then the said transactions shall be treated as null and void and not binding on the rights.

SCHEDULE OF PROPERTY

All that the agriculture lands bearing Sy.No.508/I, adm. Ac.1- 16 Gts., Sy.No.509/I, adm. Ac.1-07 Gts., Sy.No.510/I, adm. Ac.2-16 Gts., and Sy.No.511/ 13/A, adm. Ac.1-11 Gts., totally admeasuring Ac.6-10, situated at Timmapur Village, Kandukur Mandal, Ranga Reddy District and bounded by;

North: Land belongs to Bestha Lingaiah, **South:** Land belongs to Siddala Ramulu,
East: Land belongs to Talla Setha Ramulu & others, **West:** Land belongs to Defendants.

Sd/- **G. SUDHAKAR REDDY,** Advocate
Plot No. 131, Sairam Nagar Colony, Champapet, Hyderabad-79
Cell No. 9848470673

సంగీతలక్ష్మికి టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సంగీతలక్ష్మి

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి ప్రభుత్వ పాఠశాలలో పనిచేసిన దూపాటి సంగీతలక్ష్మి టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. పదేళ్ల పాటు పాఠశాల అభివృద్ధి, నాణ్యమైన బోధనకు ఆమె కృషి చేశారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి ఈ అవార్డులను అందజేశారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఆమెకు అవార్డు ప్రదానం చేశామని శారద ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పట్నం కమల మనోహర్ తెలిపారు.

ఉపాధికి ఊతం సమాజ హితం

జ్యూట్ బ్యాగుల తయారీతో స్వయం స్వావలంబన

పర్యావరణానికి ముప్పుగా మారిన ప్లాస్టిక్ రక్కసిని తరిమేయడానికి ఆమె కంకణబద్ధురాలైంది. నిత్యం ఉపయోగించే ప్లాస్టిక్ కవర్లకు బదులు అందరూ జ్యూట్ బ్యాగులను వినియోగించాలని భావించింది. అందుకు తగ్గట్లుగా తర్ఫీదు తీసుకొని 'జ్యూటి పై' పేరుతో జనపనార సంచులను తయారు చేస్తూ సమాజ హితానికి పాటుపడుతూనే ఆర్థికంగా నిలదొక్కుకుంది తాండూరులోని వాల్మీకినగర్‌కు చెందిన జి.ఉమాదేవి. ఆమె విజయగాథపై ప్రత్యేక కథనం.

- తోటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న ఉమాదేవి
- 'షీ ఇన్‌స్పైర్ ఉమెన్స్' అవార్డు అందుకున్న తాండూరువాసి

తాండూరు టౌన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆర్థిక చేయూత, ఉపాధికల్పన కోసం పట్టణంలోని శివాజీచౌక్‌లో 'జ్యూటి పై' కంపెనీ పేరుతో జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని 2022లో ఉమాదేవి ఏర్పాటు చేశారు. తొలుత రూ.లక్ష పెట్టుబడితో ఒక్క మిషన్ ఏర్పాటు చేసి కుటీర పరిశ్రమగా జ్యూట్ బ్యాగుల తయారీని ప్రారంభించారు. వీటి తయారీ కోసం ప్రత్యేకంగా ఆరు నెలల పాటు గుంటూరులో శిక్షణ తీసుకున్నారు. జ్యూట్ బ్యాగుల తయారీకి కావాల్సిన ముడిసరుకును కోల్‌కతా, బిహార్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

అభిరుచికి తగ్గట్లు

పర్యావరణ ప్రేమికులు ఎక్కువగా జ్యూట్ బ్యాగుల వినియోగానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. పుట్టినరోజు, వివాహాది తదితర శుభ కార్యాలకు రిటర్న్ గిఫ్టులుగా వీటిని అందజేస్తున్నారు. ఈ క్రమంలో ముందుగానే బ్యాగుల కోసం ఆర్డర్లు ఇస్తున్నారు. బ్యాగులపై వధూవరుల పేర్లు, కార్పొరేట్ కంపెనీ, దుకాణాల పేర్లను ప్రింట్ వేస్తున్నారు. ఆర్డర్లు పెరగడంతో పెట్టుబడిని రూ.ఐదు లక్షలకు పెంచి మరికొన్ని మిషన్లను ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ పనిచేయాల్సిన వారి సంఖ్య కూడా పెరగడంతో ప్రస్తుతం 12 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. 30 శాతం లాభాలు వస్తున్నాయని ఆమె పేర్కొంటున్నారు.



జ్యూట్ బ్యాగు తయారీలో సూచనలిస్తున్న ఉమాదేవి

గ్లోబల్ ఉమెన్ ఇన్‌స్పిరేషన్

జ్యూట్ బ్యాగులను పలు రకాల రంగులు, సైజులు, డిజైన్లలో తయారు చేయడంతో ఎక్కువ మంది వాటి వినియోగంపై మక్కువ చూపుతున్నారు. ఢిల్లీకి చెందిన గ్లోబల్ ఉమెన్ ఇన్‌స్పిరేషన్ సంస్థ మహిళా సాధికారత, ఉపాధి కల్పనకు కృషి చేస్తున్న వారికి 'షీ ఇన్‌స్పైర్ ఉమెన్స్' అనే కాన్సెప్ట్‌తో దేశంలో మహిళా వ్యాపారులకు అవార్డులను అందజేస్తున్నారు. ఈ ఏడాది పట్టణానికి చెందిన ఉమాదేవి జ్యూట్ బ్యాగులను తయారు చేస్తూ, పలువురికి ఉపాధి కల్పించడంతో ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఇటీవల ఆమె ఢిల్లీలో సంస్థ నుంచి అవార్డు అందుకున్నారు.



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న ఉమాదేవి (ఫైల్)



పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రభుత్వం ప్రజలకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు, జ్యూట్ బ్యాగుల వల్ల కలిగే లాభాలను వివరించాలి. జ్యూట్ బ్యాగుల తయారీ పరిశ్రమలకు సబ్సిడీపై రుణం అందించాలి. ఎన్ని బ్యాగులు కావాలన్నా ఆర్డర్‌పై తయారు చేసి ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. దీనివల్ల ఎక్కువ మందికి ఉపాధి దొరికే అవకాశం ఉంది.

– ఉమాదేవి, జ్యూటిపై కంపెనీ, తాండూరు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ 13,499/-కే గజం HMDA అప్రూవ్డ్ కొంగరకలాన్ ఫాక్స్ కాన్ కేయిన్స్ TCS ఏరోస్పేస్ దగ్గర్లో న్యూవెంచర్లో ప్లాటు. ఫోన్ : 8309376230 [SCA24000455]

FLAT FOR SALE

■ 2BHK Flat for Sale 1000 Sft North Face Cupboards, Lift, CC Cameras Available Dilsukhnagar Ph : 9885202404 [H-10869]

HOUSE FOR SALE

■ హయత్‌నగర్, మునగనూరు బ్యాంక్ కాలనీలో 200 చ॥గ॥ S/F 1600 SFT కొత్త ఇల్లు అమ్మకానికి కలదు. త్రాగునీరు, డ్రైనేజి కూడా కలదు. కేవలం 95L. 9849688626 [HA-2949]

PLOT FOR SALE

■ చౌటుప్పల్ సమీపంలో కేవలం 5 లక్షలకు ప్లాట్ కొంటే, 5 గ్రాముల బంగారం ఉచితం. Ph: 8332844579 [HA-05424]

■ VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ., బందరు రోడ్డు, నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, AP CRDA ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర: 90328 90357 [B-105]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [B00515]

BUSINESS OFFER

■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్ బిజినెస్ పర్సనల్ ఎడ్యుకేషన్ ప్రాపర్టీ పై లోన్స్ ఏజెంట్స్ DMA కావలెను. జీ+కమీ. Ph: 7988242391 [SCA24000453]

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న. మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9398709618 [H-796641]

■ Good opportunity monthly income,invites good investors for group of educational institutions hyd. 8639364374 [HA-98820]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Ravikiran Jeevanrao Chaulwar, S/o Jeevanrao Chaulwar R/o EIPL CS Puppalguda Hyderabad Shall Be Known as Ravikiran Chaulwar for all Purpose. [HA-05432]

LOST

■ I, K V Subba Rao, R/o. H.No: 8-3-224/A/20, G-70 Madhura Nagar, Hyd-500038. I lost my Original 15 plots documents as shown below Sunder Nagar, Kukatpally, Balanagar, Airport entrance & Middle, Kothur, Maheshwaram, Shamshabad, Jubilee hills, Banjara hills, Panjagutta, Begumpet, Pokran, Shadnagar, Ganesh gadda while shifting house. If found call 9949134580 [HA-15300]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన నున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 8074327715 [H-783357]

TOURS & TRAVELS

■ SVS టూర్స్ శ్రీలంక, కాశీ, నేపాల్, భూటాన్, గుజరాత్, ఉజ్జయిని, ఒరిస్సా, అస్సాం చార్‌దామ్, వైష్ణదేవి TN 9030123243, 7386579123 [SCA24000456]

Wanted

■ దుండిగల్, కుత్బుల్లాపూర్, నానక్ రామ్‌గూడలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం రూమ్ కలదు. Ph: 8328622868 [SCA24000454]

■ Waves వాటర్ ప్యూరిఫైర్, కం/కి సర్వీస్ టెక్నీషియన్స్, ఎగ్జిక్యూటివ్స్. Q: 10th పాస్/ఫెయిల్. జీతం : ESI, PF & కమీషన్. 8639064557 [SCA4000408]

■ మధురానగర్ శారదా శారీస్ నందు కస్టమర్స్‌కు ఫోన్ చేయుటకు అనుభవం గల టెలికాలర్స్ కావలెను. ఫోన్: 9912641658, 7981582891 [SCA24000428]

■ అర్జెంటుగా అకౌంటెంట్, సెక్యూరిటీ గార్డ్స్ మరియు డ్రైవర్స్ కావలెను. సంప్రదించండి. ఫోన్: 9392663777, 9246663777 [SCA2400438]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185488]

■ ప్రముఖ VSR Services Office నందు పనిచేయుటకు లేడీ టెలీకాలర్స్, లేడీ రిసెప్షనిస్ట్-10, లేడీ బ్రాంచ్ మేనేజర్స్-10, లేడీ హెల్పర్స్ ... కావలెను. ... జీతం: 12,000/- నుండి 20,000/- వరకు, వయసు : 20-30 సం॥ Q: 10th - డిగ్రీ. ఫోన్ : 99858 99888 [V-823373]

■ శ్రీలక్ష్మీ హోం కేర్: హైదరాబాద్ నందు వృద్ధులకు పేషంట్లకు సేవ చేయుటకు బేబీకేర్ ఇంటి/ వంట పనికి స్త్రీ/ పురుషులు కావలెను. జీతం: 18000/- రూం+ మీల్స్ ఫ్రీ ✆ 93471 48051 [G-2191]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ : 18K. Ph: 9160900024 [SCA24000401]

■ Wanted Experience Sales Person & Helpers For Handloom Saree Store Near to Secretariate. Salary 15-18K, Ph: 9989698981 [HA-805]

FACULTY TEACHERS

■ Wanted Vice Principal, Social, Eng, Phy-Bio Science, Pet, Telugu, Comp, 6-10th, English, Science 1-5th Class. Nadergul, Kongara Kalan. 8790190846, 8099093579 [HA-14732]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్స్), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

గమనిక : జీఎస్టీ మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

గజ ఈతగాళ్లతో మృతదేహాన్ని వెలికి తీయించిన పోలీసులు



షేక్ మోసిన్ (ఫైల్)

పహాడీషరీఫ్: కుటుంబ కలహాలతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆటోడ్రైవర్ ఊహించినట్లుగానే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడి మృతదేహాన్ని పహాడీషరీఫ్ పోలీసులు మంగళవారం వెలికితీశారు. ఎస్సై శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు నెలల క్రితం సనా అనే యువతిని వివాహమాడిన జల్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ మోసిన్(25)కు తొలినాళ్ల నుంచే ఆర్థిక ఇబ్బందులతో బాధపడేవారు. ఈ విషయమై భార్య, అత్తింటిగారితో గొడవలు జరిగేవి. ఈ క్రమంలోనే ఆదివారం ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిన మోసిన్.. రాత్రి 10.30 గంటలకు జల్‌పల్లి చెరువు గట్టున ఉన్నట్లు సోదరుడు మౌలానాకు వాట్సాప్‌లో వాయిస్ రికార్డింగ్, లొకేషన్ పంపించాడు. వెంటనే వెళ్లి పరిశీలించినప్పటికీ మోసిన్ కనిపించలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. మంగళవారం చెరువులో మోసిన్ మృతదేహం తేలియాడుతుండడాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఈతగాళ్ల సాయంతో వెలికి తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


పాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ



శిక్షణ పొందిన మహిళలతో కో ఆర్డినేటర్లు

యాచారం: మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలో అభ్యుదయ పాడి మహిళలకు మంగళవారం పాల పదార్థాల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ, రాజేంద్రనగర్ పశు ఉత్పత్తుల విభాగం, ఆస్ట్రేలియా అల్యూమినీ గ్రాంట్ ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలకు పాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఉత్పత్తులు తయారీచేసే విధానంపై డాక్టర్ కొండల్‌రెడ్డి, డాక్టర్ శశికుమార్, డాక్టర్ మహేందర్‌లు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పాలకోవ, నెయ్యి, కలకాండ, పన్నీరు, సుగంధ పాలు, రసగుల్ల తదితర పాల పదార్థాల తయారీపై వివరించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, డాక్టర్ కొండల్‌రెడ్డి, డాక్టర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

సెమినార్‌ను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ స్థాయి సెమినార్ నవంబర్ 1న చేవెళ్లలో నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య పేర్కొన్నారు. సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఈ సెమినార్‌కు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు లేనివారికి 120 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కూలీలకు పనిదినాలు 200 రోజులు కల్పించాలని, కూలీ రూ.600 ఇవ్వాలని సెమినార్‌లో చర్చిస్తారని తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకొని ముందుకు సాగాల్సి ఉంటుందని చెప్పారు. చేవెళ్లలోని అంబేడ్కర్‌భవన్‌లో సమావేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఏఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, నాయకులు సత్తిరెడ్డి, మంజుల, స్వరూప, శివ, కిష్టయ్య, షబీర్ పాల్గొన్నారు.

కామాంధుడికి జీవితఖైదు

బాలికపై అత్యాచారం కేసులో శిక్ష



మహ్మద్‌ఖాజా

అబ్దుల్లాపూర్‌మెట్: వావివరసలు మరిచిన కామాంధుడికి కోర్టు తీర్పు కటకటాల పాలు చేసింది. వరసకు కూతురైన ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.30 వేల జరిమానా, బాధితురాలికి రూ.12 లక్షలు చెల్లించాలని జిల్లా ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి హరీశ తీర్పునిచ్చారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామంలో నివాసముండే మహ్మద్ ఖాజా(43) వృత్తిరీత్యా లారీ డ్రైవర్. కాగా అతని ఇంటికి సమీపంలో ఉండే కూతురు వరసైన ఓ బాలికను బెదిరించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. 2023 నవంబర్‌లో బాధితురాలు కుటుంబీకులతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి పూర్తి వివరాలతో చార్జిషీట్‌ను దాఖలు చేయగా పరిశీలించిన జిల్లా ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి హరీశ నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ తీర్పునిచ్చారు. ఖాజాకు జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.12లక్షలు నష్టపరిహారం అందించాలంటూ పేర్కొన్నారు. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కోమలత, నరేష్ వాదనలు వినిపించారు.

పింఛన్ల పెంపునకు పోరు

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

మంచాల: పింఛన్ల పెంపు కోసం ప్రభుత్వంతో పోరాటం చేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన వికలాంగుల హక్కుల పోరాట సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసరా పింఛన్లు పెంచుతామని చెప్పి పది నెలలు గడుస్తున్నా నేటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. పింఛన్‌దారులను ఎన్నికల ముందు నమ్మించి మోసం చేసిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దీనిపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోరాటానికి సంసిద్ధం కావాలన్నారు. ఇబ్రహీంపట్నంలో ఐదు వేల మంది పింఛన్‌దారులతో మహాసభ ఏర్పాటు చేస్తామన్నారు. నవంబర్ 26న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు ముట్టడి చేస్తామని హెచ్చరించారు. దివ్యాంగుల సమస్యలపై ఉద్యమాలు పెద్ద ఎత్తున చేస్తామన్నారు. మంచాల మండల కేంద్రంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి కమిటీ అధ్యక్షుడిగా ఆశ్వల బాలరాజును ఎన్నుకున్నారు. ఆయనతో పాటు మరో పది మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కరంటోత్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, మండల అధ్యక్షుడు దానయ్య, నాయకులు సంజీవ, భాను, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



కడ్తాల్: నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



షాబాద్: తాళ్లపల్లిలో ఉపాధ్యాయుల దీక్ష

తపస్ జిల్లా మహిళా ప్రముఖ్ సుమరంజిత

కడ్తాల్: ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా మహిళా ప్రముఖ్ సుమరంజిత డిమాండ్ చేశారు. డీఏ, పీఆర్‌సీ, పెండింగ్ బిల్లుల పరిష్కారం కోసం తపస్ రాష్ట్ర ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం మండల పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుమరంజిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీఏ, పీఆర్‌సీ, పెండింగ్ బిల్లులు పరిష్కారమవుతాయని పదినెలలుగా ఎదురుచూసిన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వం పీఆర్సీ నివేదికను తెప్పించుకోవడం పట్ల తాత్సారం ప్రదర్శిస్తుందన్నారు. ధర్మబద్ధంగా ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక చెల్లింపులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి ఎన్నోసార్లు విన్నవించిన స్పందన లేదన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం కడ్తాల్, ఆమనగల్లు మండలాల అధ్యక్షులు సంతోష్‌కుమార్, స్వాతి, కార్యదర్శి మౌనిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

షాబాద్: ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉపాధ్యాయుల డీఏలు, పీఆర్సీ పెండింగ్ బిల్లుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల దక్షిణ మధ్య క్షేత్ర ప్రముఖ విద్యాలయాల అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. ఉపాధ్యాయుల డీఏలు, పెండింగ్ బిల్లులు పరిష్కరించాలని పేర్కొంటూ షాబాద్‌లో నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు దీక్ష చేపట్టారు. మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో ధర్మ గ్రహ దీక్షలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.